www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 9 మార్చి 2025



విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

భాష్యం స్కూల్ ఫేర్‌వెల్ వేడుకల్లో టిడిపి పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ

తణుకు : మంచి ప్రవర్తన కలిగి, ఏకాగ్రతతో కష్టపడి చదివితే పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చునని టిడిపి పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, సూర్యతేజ ఆర్థోపెడిక్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మద్దుకూరి వీరవెంకటప్రకాష్ అన్నారు. శనివారం తణుకు భాష్యం స్కూల్‌లో ఫేర్వెల్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన భవిష్యత్‌కు ఇప్పటి నుంచే మంచి ప్రణాళికలు ఏర్పాటు చేసుకుని, దానికి తగిన విధంగా కృషిచేసి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలియజేశారు. అనంతరం 9, 10 తరగతుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలతో అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎ.శ్రీమన్నారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ జివి.పాండురంగారావు, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపల్ పిఎల్‌బి.శేషారత్నం పాల్గొన్నారు.

బెడ్స్ బెంగ.. వైద్యం అరకొర..!

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో రోగుల కష్టాలు

బెడ్స్ లేవని విజయవాడ పంపడంపై ఆవేదన

వైద్యుల నియామకంపై పట్టించుకోని సర్కార్

ఐసియులోనూ సక్రమంగా అందని వైద్యం

మెడికల్ కాలేజీగా మార్పు చేశాక పరిస్థితి అధ్వానం

ఆసుపత్రి సమస్యలపై ప్రత్యేక సమావేశంపై డిఆర్‌సిలో నిర్ణయం

ఇప్పటికీ అతీగతీలేని పరిస్థితి

రోగుల బాధలపై ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడింది' అనే చందంగా ఏలూరు సర్వజన ఆసుపత్రి పరిస్థితి తయారైంది. వైద్యవిధాన పరిషత్ పరిధిలో ఉన్నప్పుడు అద్భుతమైన వైద్య సేవలందించిన ఏలూరు జిల్లా ఆసుపత్రి, బోధనా ఆసుపత్రిగా మారిన తర్వాత అత్యంత దారుణంగా మారిందని జనం తలలు పట్టుకుంటున్నారు. సర్వజన ఆసుపత్రికి వెళ్లాలంటేనే రోగులు భయపడే పరిస్థితి తీసుకొచ్చారు. అత్యవసర వైద్యం కోసం సర్వజన ఆసుపత్రికి వెళ్లిన రోగులకు వైద్యులు మొదట చెప్పేమాట ఒక్కటే.. బెడ్స్ లేవు విజయవాడ, గుంటూరుకుగాని వెళ్లండని. రోగులు గట్టిగా నిలదీస్తే ఒక సెలైన్ పెట్టి వదిలేస్తున్నారు. దీంతో రోగుల బంధువులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంటుంది. ఆసుపత్రిలో బెడ్ ఇప్పించండంటూ రాజకీయ నాయకులకో.. లేక పలుకుబడి ఉన్నవారికో ఫోన్లు చేసి రోగి బంధువులు వేడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. బెడ్స్ ఖాళీగా ఉన్నా లేవని విజయవాడ రిఫర్ చేస్తున్నారని రోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు ఏదైనా అత్యవసర కేసులు తప్ప విజయవాడ, గుంటూరుకు రిఫర్ చేసేవారు కాదు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇక్కడ వైద్యం అందే కేసులను సైతం విజయవాడ వెళ్లిపోవాలని చెప్పేస్తున్నారు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ప్రతిరోజూ వెయ్యి నుంచి 1200 మంది రోగులు ఓపి సేవలు పొందుతుంటారు. 600 మందికిపైగా రోగులకు ఇన్‌పేషెంట్ సేవలు అందుతాయి. బోధనా ఆసుపత్రిలో రోగులకు పూర్తిస్థాయిలో సేవలు అందించాలంటే 97 మంది వైద్యులు ఉండాలి. ప్రస్తుతం 35 మంది కూడా లేని పరిస్థితి. దీంతో రోగులకు వైద్యసేవలు అరకొరగా అందుతున్నాయి. సర్వజన ఆసుపత్రికి వెళ్తే



ఏలూరు సర్వజన ఆసుపత్రి

రోగం తగ్గి ఇంటికి వెళ్తామనే నమ్మకం జనంలో తగ్గిపోతుంది. ఐసియులో సైతం వైద్యసేవలు సరిగా అందడం లేదని రోగులు తీవ్ర అసంతృప్తి చెందుతున్నారు. ఐసియులో వైద్యుల పర్యవేక్షణ సరిగా ఉండడం లేదని రోగులు గగ్గోలు పెడుతున్నారు. ఆసుపత్రిలో శుభ్రత విషయంలో మెరుగ్గా ఉన్నప్పటికీ వైద్యం విషయంలో మాత్రం రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోధనా ఆసుపత్రిలో వైద్యసేవలకు సంబంధించి పర్యవేక్షణ అంతా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ ఆధ్వర్యంలోనే ఉంటుంది. ప్రిన్సిపల్ సరిగా పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి.

మళ్లీ ప్రయివేటు ఆసుపత్రికి

సర్వజన ఆసుపత్రికి వచ్చిన రోగులు చాలా మంది సరైన వైద్యం అందక డిశ్చార్జి చేయించుకుని ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పేదలు ఆర్థికంగా నలిగిపోతున్నారు. బోధనా ఆసుపత్రిలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్లుగా ఉంటారు. వీరు రోగులతో సరిగా సఖ్యతగా ఉండటం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు సైతం వైద్యుల కొరత ఉండేది. ఇప్పుడు కంటే ఎక్కువ మంది రోగులు ఆసుపత్రికి వచ్చేవారు. అప్పుడు అందినట్లుగా ఇప్పుడు వైద్యసేవలు ఎందుకు అందడం లేదనే ప్రశ్నలు అందరినీ వేధిస్తున్నాయి. జిల్లా ఆసుపత్రిని మెడికల్ కాలేజీగా మార్పు చేసి ప్రజలకు వైద్యసేవలు సరిగా అందకుండా చేశారనే అభిప్రాయం జనాల్లో వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం సైతం సరిగా పట్టించుకోవడం లేదనే చర్చ జనాల్లో నడుస్తోంది.

డిఆర్‌సి సమావేశంలో నిర్ణయాల అమలేది..?

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై జనవరి 16న ఏలూరు గోదావరి సమావేశ మందిరంలో జరిగిన డిఆర్‌సి సమావేశంలో చర్చ జరిగింది. ప్రజాప్రతినిధులంతా ఆసుపత్రిలోని సమస్యలను ఏకరువు పెట్టారు. దీంతో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ సర్వజన ఆసుపత్రిలో సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, తాను కూడా ఉదయం విజిట్ చేశానని తెలిపారు. ఇప్పుడు పూర్తిస్థాయిలో చర్చకు సమయం లేదు కాబట్టి వారం, పది రోజుల్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుందామని తెలిపారు. దాదాపు రెండు నెలలు గడిచిపోతుంది. ఇప్పటి వరకూ డిఆర్‌సి సమావేశంలో తీసుకున్న ప్రత్యేక సమావేశ నిర్ణయం ఏమైందో ఏఒక్కరికీ తెలీని పరిస్థితి. రోగుల బాధలు ప్రజాప్రతినిధులకు, అధికారులకు పట్టడం లేదా అనే చర్చ సాగుతోంది. ఏలూరు సర్వజన ఆసుపత్రిని గాడిన పెట్టకపోతే జిల్లా ప్రజానీకం పరిస్థితి మున్ముందు మరింత దారుణంగా మారనుందనడంలో ఎటువంటి సందేహమూ అక్కర్లేదు.



బెలూన్లు వదులుతున్న ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు

అతివల అడుగు భవిష్యత్తుకు ముందడుగు


ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

2కె వాక్‌లో 600 మంది మహిళలు భాగస్వామ్యం

ఆలోచింపజేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆకట్టుకున్న స్టాల్స్

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సంబరాలు అంబరాన్నంటాయి. జిల్లా నలుమూలల నుంచి సుమారు 600 మంది మహిళలు తరలొచ్చారు. స్థానిక ప్రకాశం చౌక్‌లో మహిళలతో ఏర్పాటు చేసిన ర్యాలీని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఉప సభాపతి కనుమూరి రఘురామకృష్ణంరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మి, ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ సంయుక్తంగా బెలూన్లు గాలిలోకి వదిలి ప్రారంభించారు. అక్కడ నుంచి అంబేద్కర్ చౌక్, గాంధీచౌక్, నటరాజ్ థియేటర్ రోడ్డు మీదుగా అడ్డవంతెన నుంచి అల్లూరి సీతారామరాజు స్మృతివనం వరకు ర్యాలీ సాగింది. కాస్మోపాలిటిన్ క్లబ్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సభకు కలెక్టర్ నాగరాణి, భీమవరం ఎంఎల్‌ఎ, పిఎసి ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి, మహిళా అధికారులకు సత్కారం

మహిళలు తలచుకుంటే సాధించలేనిదేదీ లేదు

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

మగవారితో సమానంగా మహిళలకు అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాలలో విజయం సాధిస్తారు. అంతరిక్షంలోకి వెళ్లేందుకు పురుషులతోపాటు మహిళలు పోటీ పడుతున్నారని, మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదు.

మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ల కల్పనకు కేంద్రం కృషి

డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు

సృష్టికి మూలం స్త్రీ మూర్తి. స్త్రీ లేకపోతే సృష్టే లేదు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం, స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాలనేది ఎన్‌డిఎ ప్రభుత్వ ఆశయం. ఆడవారితో సమానంగా మగవారు కూడా ఇంటి పనులు చేసుకోవాలి.

అభివృద్ధికి రాజమార్గం విద్యనే

కలెక్టర్ చదలవాడ నాగరాణి

దశాబ్ద కాలం మహిళలు సాధించిన విజయాలు, హక్కులు, సమానత్వం, సాధికారత లక్ష్యంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నాం. మగవారితో సమానంగా మహిళలకు అవకాశాలు కల్పిస్తే మంచి ఫలితాలు సాధిస్తారు. విద్య ఒక్కటే అభివృద్ధికి రాజమార్గం. మహిళలు తమ కష్టాలను, సమస్యలను ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలి. ఒకప్పుడు ఇంటికి పరిమితమైన మహిళ ఈరోజు విద్య, వైద్యం, క్రీడా రంగాలకే పరిమితం కాకుండా అంతరిక్ష యానం చేసే స్థాయికి ఎదిగింది.

మహిళల ప్రోత్సాహానికి సంక్షేమ పథకాల అమలు

భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు

ఏ కార్యమైనా చేయగల శక్తి స్త్రీకి మాత్రమే ఉంది. ప్రతిఒక్కరి విజయం వెనుక స్త్రీ శక్తి ఉంటుంది. ప్రభుత్వం మహిళలను అన్ని విధాలా ప్రోత్సహిస్తూ ఆర్థికంగా బలపడేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది.

కార్మికోద్యమం నుంచి మహిళా దినోత్సవం

ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

దశాబ్దాల క్రితం మహిళలను పారిశ్రామిక రంగాల్లో రోజుకు 18 గంటలు పని చేయించి శ్రమ దోపిడి జరిగేది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్మికోద్యమం నుంచి పుట్టుకొచ్చింది. ఎంతోమంది మహిళలు తమ హక్కుల కోసం అనేక పోరాటాలు చేసి సాధించిన ఫలితమే అంతర్జాతీయ మహిళా దినోత్సవం.

మహిళల ఆత్మగౌరవాన్ని పెంచింది ఎన్‌టిఆర్

ఎపి ఎఎస్‌సిపిసి ఛైర్‌పర్సన్ పీతల సుజాత

ఎన్‌టి.రామారావు మహిళలకు పురుషులతోపాటు ఆస్తిలో సమాన హక్కు కల్పించి మహిళల ఆత్మ గౌరవాన్ని పెంచారు. సిఎం చంద్రబాబు నాటిన డ్వాక్రా విత్తనం నేడు మహావృక్షమైంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు దీపం-2 పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నారు. త్వరలో ఉచిత బస్సు, తల్లికి వందనం వంటి పథకాలను అమలు చేస్తారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు

ఏ విషయంలోనూ మహిళలు తక్కువ కాదు. ప్రతి కుటుంబం నుండి ఒక మహిళా పారిశ్రామిక వేత్త రావాలి.

అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ

అన్ని రంగాల్లో మహిళలకు అవకాశాలు ఇస్తే మగవారి కంటే మంచి విజయాలు సాధిస్తారు. రాష్ట్ర అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం. రానున్న కాలంలో ప్రభుత్వం మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి తగిన గౌరవాన్ని ఇస్తుంది.

మహిళలకు ఘన సత్కారం

వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న మహిళా అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, సోషల్ వర్కర్లలో అత్యుత్తమ సేవలను అందించిన మహిళలను కలెక్టర్ చదలవాడ నాగరాణి, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించి, మెమొంటోలను అందజేశారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలుగా రూ.40 కోట్లు, 701 మంది స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలుగా రూ.95.59 కోట్లు, పిఎం విశ్వకర్మ పథకం కింద రూ.75 లక్షలు, సహాయ సహకార సంఘాలకు రూ.15 కోట్లు నమూనా చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాల్స్

భారతీయ విద్యాభవన్స్, విష్ణు కళాశాల విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. నృత్య ప్రదర్శనలు, దేశ సేవలో మహోన్నత స్థానం పొందిన మదర్ థెరిస్సా, ఝాన్సీ లక్ష్మీబాయి, సరోజినీనాయుడు, ఇందిరాగాంధీ, కిరణ్‌బేడీ, కరణం మల్లేశ్వరి, మహానటి సావిత్రి, డొక్కా సీతమ్మ వంటి మహిళా మణులను స్మరణకు తెచ్చేలా వస్త్రధారణతో విద్యార్థినుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. డిఆర్‌డిఎ, మెప్మా, ఐసిడిఎస్, మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్లు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్ పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుణకుమారి, ట్రైనీ డిఎస్‌పి కె.మానస, ఎఎస్‌పి భీమారావు, ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఐసిడిఎస్ పిడి బి.సుజాతరాణి, డిఆర్‌డిఎ పిడి ఎంఎస్ఎస్.వేణుగోపాల్, డిఇఒ ఇ.నారాయణ, ఎల్‌డిఎం ఎ.నాగేంద్రప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సేవా సంస్థల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

సమస్యలపై శంఖారావం

సిపిఎం ఆధ్వర్యాన ప్రజా చైతన్య సైకిల్ యాత్ర ప్రారంభం

ప్రభుత్వంలో కదలిక రాకపోతే భవిష్యత్తు ఉద్యమాలకు కార్యాచరణకు దిగుతాం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం

గొప్పలు తప్ప ఆచరణ శూన్యం

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్



భీమవరం: ఎర్ర కండువా వేసి సైకిల్ యాత్ర ప్రారంభిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం

ఇల్లు.. ఇళ్ల స్థలాలు.. ఇళ్ల పట్టాలు.. టిడ్కో ఇళ్లు.. ఇళ్ల బకాయిలు వంటి సమస్యలపై సిపిఎం శంఖారావం పూరించింది. సమస్యలపై అధ్యయనం చేసి లబ్ధిదారుల కుటుంబాల్లో భరోసా నింపి ప్రభుత్వం మెడలు వంచి సమస్యలు పరిష్కరించేందుకు సమాయత్తమైంది. తాడేరు టిడ్కో గృహ సముదాయాల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాచైతన్య సైకిల్ యాత్రను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం శనివారం జెండా ఊపి ప్రారంభించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ దళ నాయకులుగా వ్యవహరిస్తున్న ఈ సైకిల్ యాత్ర జిల్లావ్యాప్తంగా 20 మండలాలు, ఆరు పట్టణ ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను అధ్యయనం చేయడంతోపాటు ప్రజలతో మమేకమై వారి సమస్యలను సైతం తెలుసుకుని సుమారు 500 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర సాగనుంది. ఈ యాత్రను ప్రారంభించిన రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం మట్లాడుతూ వేసవిని సైతం లెక్క చేయకుండా మండుటెండలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇళ్లు, ఇళ్ల పట్టాలు, కాలనీల్లో మౌలిక సదుపాయాలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 17వ తేదీ వరకు సిపిఎం బృందం జిల్లా అంతటా 15 మందితో సైకిల్ యాత్రను ప్రారంభించిందన్నారు. సొంతింటి కల అనేది కోరిక కాదని, అది హక్కు అని అన్నారు. సొంతిల్లు లేక అనేక మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నార న్నారు. ఇక్కడ ఎనిమిది వేలు టిడ్కో ఇళ్లు నిర్మిస్తే సగం మందికి కూడా ఇళ్లు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. ఇక్కడ నివాసం ఉంటున్నవారిని అడిగితే దూరం నుండి చూడటానికి చాలా అందంగా ఉంటాయండి, అయితే వీటిలో కనీస సౌకర్యాలు లేవని ఆందోళన చెందుతున్నారన్నారు. జిల్లావ్యాప్తంగా టిడ్కో ఇళ్ల సమస్యలను పరిష్కరించాలని, ఇల్లు లేని పేదలందరికీ ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాలకొల్లులో టిడ్కో ఇళ్లలో నివాసముంటున్న ఒక మహిళ రెండు కుక్కలు పెంచుకుంటుందని, ఇదేమిటీ దొంగల భయమా అని అడిగితే, ఇక్కడ పాములు భయం ఉందని చెప్పారని గుర్తు చేశారు. భవన సముదాయాల వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడమే దీనికి నిదర్శనమన్నారు. ఇల్లు లేని వారు ఇంటి అద్దె చెల్లించలేక, ఇల్లు ఉన్నవారు బ్యాం కు రుణం కట్టలేక, మౌలిక సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారన్నారు. ఉండి ఎంఎల్‌ఎ రఘురామ కృష్ణంరాజు ఇళ్లు నిర్మించడం మాట పక్కన పెట్టి ఉన్న ఇళ్లను తొలగించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శిం చారు. గతంలో ముఖ్యమంత్రితో యుద్ధం చేస్తే పేదలకు అండగా ఉంటారని అనుకుంటే ప్రస్తుతం పేదలతో యుద్ధం చేస్తున్నారని విమర్శించారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఉండి ఎంఎల్ఎను కట్టడి చేయాలన్నారు. పేదలు ఎదుర్కొంటున్న ఇళ్ల సమస్యలపై ఈ నెల 17న జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా చేపడతామని, వేలాదిమంది పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.



మొగల్తూరు: సమస్యలు వింటున్న నేతలు

గొప్పలు తప్ప ఆచరణ శూన్యం

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

జిల్లాలో ఇళ్ల సమస్య తీవ్రంగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. ప్రభుత్వాలు మాత్రం అందరికీ ఇళ్లు ఇచ్చేశాం, ఇళ్ల సమస్యను పరిష్కరించేశాం, ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకున్నాం అని గొప్పలు చెప్పుకుంటోందన్నారు. తాడేరులో 82 ఎకరాల భూమిని 2007లో కొనుగోలు చేసింద న్నారు. ఇష్టం లేకపోయినా అపార్టుమెంట్లలో ఫ్లాట్లను తీసుకోవాల్సి వచ్చిందన్నారు. 18 ఏళ్ల క్రితం ఇంటి కోసం దరఖాస్తు పెట్టుకుంటే ఇళ్లు ఇచ్చే సమయానికి వారికి 60 ఏళ్లు దాటిపో యాయని, మీరు బ్యాంకు రుణం చెల్లించలేరం టూ ఇల్లు ఇవ్వడం కుదరదని చెప్పడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. 17న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాలో బాధిత ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. భీమవరంలో ప్రారంభమైన ఈ సైకిల్ యాత్ర తాడేరు, కె.బేతపూడి, వెంప మీదుగా మొగల్తూరు మండలం కొత్తపాలెం, మొగల్తూరు, నరసాపురం మండలం సీతారామపురం, మంగళిగుంటపాలెం మీదుగా సాగి రుస్తుంబాద చేరుకుంది. యాత్రలో నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, కారుమంచి క్రాంతిబాబు, మామిడిశెట్టి రామాంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్, శేషపు అశ్రియ్య, పి.దుర్గారావు, పి.నాగేంద్రబాబు, పి.మృత్యుంజయ, జి.నాగేశ్వరరావు, బి.విజయకుమార్, ఆర్.వెంకటరత్నం, ఎం.వైకుంఠరావు, పి.ఆంజనేయులు, బొక్కా సత్యనారాయణ పాల్గొన్నారు.

మొగల్తూరు: గత ప్రభుత్వాల హయాంలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేసి వారి ఖాతాలకు జమ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ప్రజా చైతన్య సైకిల్ యాత్ర మండలంలోని శేరేపాలెం, కొత్తపాలెం, మొగల్తూరు నాగదేవత కాలనీల మీదుగా సాగింది. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ కాలనీల్లో విద్యుత్, రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీ, అంగన్వాడీ, వైద్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షల సహాయం ఇవ్వాలన్నారు. ఇంటి నిర్మాణానికి గతంలో తీసుకున్న బ్యాంకు రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కవురు పెద్దిరాజు, కె.బాలు, యడ్ల చిట్టిబాబు, ఒడుగు శ్రీనివాస్, కొల్లాటి బాబురావు, రాజకుమార్, ముచ్చర్ల త్రిమూర్తులు, బి.నాగేశ్వ రరావు తదితరులు పాల్గొన్నారు.



భీమవరం: వినతులు స్వీకరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

నరసాపురం: కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. సిపిఎం సైకిల్ యాత్ర నరసాపురం మండలం సీతారామపురం నార్త్ చేరుకుంది. గ్రామంలోని ఒఎన్‌జిసి కాలనీలో మహిళలు ఖాళీ బిందెలతో తమ తాగునీటి సమస్యను నేతల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్ డిపిఒ బి.అరుణశ్రీతో ఫోన్లో మాట్లాడారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు ఆర్‌డిఒ దాసి రాజు, ఎంపిడిఒ జివిఎస్.రామకృష్ణంరాజు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. కార్యక్రమంలో జల్లి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ఇళ్ల హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య సైకిల్ యాత్రను శనివారం స్థానిక సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కెఎస్‌ఎన్ కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్నుద్దేశించి సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో జవ్వాది శ్రీను, శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, యడవల్లి వెంకట దుర్గారావు, నగిరెడ్డి సాయి, రాజారావు, మిద్దె జాన్, రాజేష్, మద్దాల సత్యనారాయణ, దేవల శివ గణేష్ పాల్గొన్నారు.

ఫలితాలొచ్చాయి.. పనులే మిగిలాయి..!



గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల ఫలితాలు వెలువడటంతో ఎన్నికల కోడ్ తొలగిపోయింది. కోడ్ పేరిట ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన పనులే మిగిలాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక రెండు జిల్లాల్లో వేసవి తీవ్రత నేపథ్యంలో తాగు, సాగునీటి సమస్యలు తెరపైకొస్తున్నాయి.

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపొందారు. అయితే ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి ఫలితాలు వెల్లడయ్యే వరకూ గతంలో ఎన్నడూ లేనివిధంగా జిల్లా అధికారుల తీరు చర్చనీయాంశమైంది. ప్రధానంగా కౌంటింగ్ ముందు రోజు వరకూ సిబ్బందికి శిక్షణ, అభ్యర్థుల సమావేశాల్లో అంకెలు తప్ప ఎటువంటి రౌండ్లు, గీతలు గీచినా ఓటు చెల్లదని చెప్పిన అధికారులు కౌంటింగ్ ప్రారంభంలో మాటమార్చారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. రౌండ్ చేసినా ఇబ్బంది లేదని, రోమన్ అంకెలను సైతం అంగీకరించొచ్చని మౌఖిక ఆదేశాలివ్వడం కౌంటింగ్ ఏజెంట్ల మధ్య వాగ్వివాదానికి దారితీసిందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఈ తరహా మార్పులు కౌంటింగ్ ముందు ఎలా ప్రకటిస్తారనేది సందేహాస్పదమే. ఎన్నికల మాన్యువల్ ప్రకారం కూడా ఇది సరికాదనేది అందరికీ తెలిసిందే. దీనికితోడు కృష్ణా, గుంటూరు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ ఒక రీతిగా సాగగా, గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ మరో రీతిగా సాగింది. దీనివల్ల ఇక్కడి ఎంఎల్‌సి ఎన్నిక ఫలితం రావడానికి 30 గంటలకుపైగా పట్టింది. మరి ఎన్నికల సంఘం వేర్వేరు విధానాల్లో కౌంటింగ్ ఎలా అనుమతిచ్చిందనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. ఇదే కాదు కోడ్ అమలులోనూ అధికార పక్షానికి అనుకూలంగా అధికార యంత్రాంగం వ్యవహరించిందనే విమర్శలు మొదట్లో విన్పించాయి. పోలింగ్ రోజున కూడా ఒరిజినల్ గుర్తింపు పత్రం లేకుండా జిరాక్స్ తీసుకొచ్చినా ఓటింగ్ ఎలా అనుమతించారనేది ఎవరికీ అర్థం కాని విషయంగా మిగిలింది. ఇక పోలింగ్ కేంద్రాల్లోకి ప్రజాప్రతినిధులు గుంపులుగా వెళ్లినా జిల్లా అధికారులు సైతం స్పందించకపోవడం, పోలింగ్ కేంద్రాల వద్దే అధికార పార్టీ వారు ప్రత్యర్థి ఏజెంట్లపై దాడికి తెగబడుతున్నా పోలీసులు చోద్యం చూడటం చర్చనీయాంశమైంది. ఇదే కాదు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓట్ల నమోదులోనూ అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు చెప్పిన చోటుకు మండలస్థాయి అధికారులు సైతం వెళ్లి ఓటు ఎలా నమోదు చేయాలో వివరించడంతోపాటు ఓటర్ల నమోదు చేపట్టడంపై నాడే విమర్శలు వెల్లువెత్తాయి. మొత్తంగా గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల తీరు చూస్తే ఎవరు గెలిచారు.. ఎవరు ఓడారు అనేదానికన్నా అధికార యంత్రాంగం తీరే చర్చనీయాంశమైందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

ఎన్నికల కోడ్ ముగియడంతో ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ప్రారంభం కానుంది. దీనికి వినతులు పెద్దసంఖ్యలో వెల్లువెత్తే అవకాశం ఉంది. ఈలోపుగానే రైతులను సాగునీటి కొరత వెంటాడుతోంది. రెండు జిల్లాల్లోనూ ఆయకట్టు శివారు, కాల్వ శివారు భూములకు సాగునీరందక ఎండిపోతున్న పరిస్థితి పలుచోట్ల ఉంది. సాక్షాత్తూ జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు సొంత జిల్లాలోనే ఆచంట, నరసాపురం తదితర ప్రాంతాల్లో సాగునీటి ఎద్దడి స్పష్టంగా కన్పిస్తోంది. ఏలూరు జిల్లాలోనూ ఈ పరిస్థితి ఉంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు రంగంలోకి దిగితే తప్ప రైతుల సాగునీటి కష్టాలు గట్టెక్కే అవకాశం కన్పించడం లేదు. ఇక వేసవి ఎండల తీవ్రత మార్చి మొదటి వారంలో చాలా ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో తాగునీటి విషయంలో మరింత అప్రమత్తత అవసరం. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు దీనిపై క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది. దీనికి అవసరమైన నిధులు ఇవ్వడంతోపాటు పనులన్నీ సక్రమంగా పూర్తయ్యేలా జిల్లా అధికారుల పర్యవేక్షణ తప్పనిసరి. మరి జిల్లా అధికారులు ఈ వేసవిలో జిల్లావాసుల దాహార్తి ఎలా తీరుస్తారో వేచిచూడాల్సి ఉందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

219 ఎన్‌డిపిఎల్ మద్యం బాటిళ్లు స్వాధీనం

తణుకు రూరల్ : కారులో యానం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 43 లీటర్ల కొలమానం కలిగిన 219 ఎన్‌డిపిఎల్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ ఆర్ఎస్.కుమారేశ్వరం తెలిపారు. కంతేరు గ్రామానికి చెందిన కొవ్వూరి వెంకట శ్రీనివాసరెడ్డి గతంలో కూడా మద్యం అక్రమంగా తరలిస్తూ వ్యాపారం చేసేవాడు. ప్రస్తుతం అధిక మొత్తంలో మద్యం బాటిళ్లు తరలిస్తున్నట్టు ఎక్సైజ్ అడిషనల్ సూపరింటెండెంట్ ప్రసాద్ రెడ్డికి అందిన సమాచారంతో ఆయన ఆదేశాల మేరకు తణుకు ఎక్సైజ్ సిఐ ఎస్.మణికంఠ రెడ్డి శనివారం సాయంత్రం ఇరగవరం మండలంలోని కంతేరు కూడలిలో ఆంజనేయస్వామి గుడి వద్ద ఎపి 37 సిఎల్ 7899 నెంబర్ కలిగిన కారును ఆపి తనిఖీ చేశారు. కారులో యానం నుంచి అక్రమంగా తరలించిన మ్యాన్షన్ హౌస్ ఫుల్ బాటిల్లు 12, రాయల్ స్టాగ్ క్వాటర్ బాటిళ్లు 26, కొరియర్ నెపోలియన్ 90 ఎంఎల్ బాటిళ్లు 96, మ్యాన్షన్ హౌస్ క్వార్టర్ బాటిల్స్ 33, కొరియర్ నపోలియన్ ఫుల్ బాటిళ్లు 4, కాల్స్బర్గ్ టిన్ బీర్లు 10, గ్రీన్ లీఫ్ గ్రేప్ బ్రాందీ క్వార్టర్ బాటిళ్లు 38, కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో ఇద్దరు ముద్దాయిలు ఉన్నారని, ఒకరు వెంకట సత్యనారాయణ రెడ్డి అలియాస్ భరత్ రెడ్డి, మద్యం సరఫరా చేసిన వ్యక్తి ప్రేమ్ కుమార్ అని తెలిపారు. ఇటీవల నరసాపురంలో దొరికిన మద్యం బాటిల్ కేసులో కూడా వెంకట సత్యనారాయణ రెడ్డి ముద్దాయిగా ఉన్నాడని, తప్పించుకు తిరుగుతున్నట్లు వివరించారు. వెంకట సత్యనారాయణ రెడ్డి, ప్రేమ్‌ను కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్ల విలువ యానంలో రూ.50 వేలు, ఎపిలో రూ.1.50 వేలు ఉంటుందన్నారు. సీజ్ చేసిన కారు విలువ రూ.5 లక్షలు ఉంటుందన్నారు. అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్ రెడ్డి, తణుకు ఎక్సైజ్ సిఐ ఎస్.మణికంఠ రెడ్డి, ఎస్ఐలు ఆర్.మధు బాబు, బి.లక్ష్మి, సిబ్బంది ఉన్నారు.


బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న దేవలీలక మహిళా సమాఖ్య సభ్యులు

గుండె బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవత్వమని, తోటివారికి సహాయం చేయడంలోనే తృప్తి ఉంటుందని ప్రముఖ వైద్యులు డాక్టర్ పాలకోడేటి నిరుపమ అన్నారు. శనివారం భీమవరం ప్యాలెస్ నెస్ట్‌లో దేవలీలక మహిళా సమాఖ్య ఉపాధ్యక్షురాలు కలువు సాయిలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. హార్ట్ పేషెంట్ కుకునూరి రామ్ ప్రసాద్ కుటుంబ సభ్యులకు రూ.లక్ష 20 వేల సహకారం అందించారు. డాక్టర్ నిరుపమ మాట్లాడుతూ మహిళలు సమాజ సేవలో కూడా పాలు పంచుకోవడం గొప్ప విషయమని, మహిళలు అన్ని రంగాల్లోనూ ముందు ఉంటున్నారు అనడానికి ఈ సహకారమే నిదర్శనమని అన్నారు. గత మూడేళ్లుగా దేవలీలక సమాఖ్య సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అద్వితీయమని అన్నారు. కార్యక్రమంలో మహిళా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో గోపాలకృష్ణంరాజు సేవలు ఎనలేనివి

సంతాప సభలో వక్తలు

భీమవరం టౌన్ : వైద్యరంగంలో డాక్టర్ గోపాలకృష్ణంరాజు సేవలు ఎనలేనివని పలువురు వక్తలు అన్నారు. భీమవరం రెండో పట్టణంలో డాక్టర్ గొట్టుముక్కల గోపాలకృష్ణంరాజు సంతాప సభ నిర్వహించారు. పట్టణంలోని పలువురు వైద్యులు, ప్రముఖులు గోపాలకృష్ణంరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిఎన్ఆర్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నరసింహరాజు, గాదిరాజు సత్యనారాయణ రాజులు మాట్లాడుతూ గోపాలకృష్ణంరాజు తండ్రి న్యాయవాది రామభద్రరాజు కూడా విద్యారంగానికి ఎన్నో సేవలు అందించారన్నారు. వైద్యులు విశ్వనాథరాజు, పిఆర్‌కె.వర్మ, కె.గోపాలరాజు, డాక్టర్ కెవిఎల్.రాజు, డాక్టర్ పేరిచర్ల దేవన్ రాజు మాట్లాడుతూ ఆత్మీయ ఆప్తుడు, సన్నిహితుడిని కోల్పోయామని, ఉదయాన్నే ఆప్యాయంగా పలకరించే వ్యక్తి అని, అందరికీ మార్గదర్శకులు గోపాలకృష్ణంరాజు అని తెలిపారు. కార్యక్రమంలో మండవ రామ్‌కుమార్ రాజు, పేరిచర్ల లక్ష్మణవర్మ, వేగేశ్న బంగార్రాజు, వేగేశ్న సీతారామరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం మండలంలోని తుందుర్రు గ్రామంలోని లేస్ పార్క్ భవనంలో బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కుట్టు మిషన్ శిక్షణ తరగతులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా భవనంలోని ప్రతి గదిని పరిశీలించి కుట్టు మిషన్ శిక్షణ తరగతులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ మహిళా దినోత్సవం రోజున మహిళలు స్వశక్తిగా ఎదిగేందుకు ఆసరాగా నిలిచే కుట్టు మిషన్ శిక్షణ తరగతులను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడినప్పుడే కుటుంబం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను మహిళల కోసం ప్రవేశపెట్టడం జరిగిందని, వాటి ప్రయోజనాలను తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈరోజు తుందుర్రులో 50 మంది మహిళలకు శిక్షణ ఇవ్వడానికి ప్రారంభించడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా మహిళలు కుట్టు మిషన్ శిక్షణ తరగతులను ఏర్పాటు చేసి, శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టుమిషన్లను అందజేయడం జరుగుతుందన్నారు. దీనికోసం బిసి కార్పొరేషన్ ద్వారా బిసి, కాపు, ఇడబ్ల్యుఎస్ వర్గాలకు చెందిన మహిళలు 4,569 మందికి శిక్షణను అందజేయడం జరుగుతుందన్నారు, దీనికి రూ.11.42 కోట్ల నిధులను కేటాయించడం జరిగిందన్నారు. ప్రతి నియోజకవర్గానికి సుమారు 600 మంది మహిళలకు కుట్టు మిషన్ శిక్షణను అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఆచంట, నరసాపురం, ఉండి నియోజకవర్గాల్లో 600 మంది చొప్పున, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో 650 మంది చొప్పున, పాలకొల్లు నియోజకవర్గంలో 819 మంది మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ తరగతులను నిర్వహించి ఉచితంగా కుట్టు మిషన్లను అందజేయడం జరుగుతుందని తెలిపారు.

బ్రీత్ ఆఫ్ లైఫ్ మినిస్ట్రీస్ ట్రస్ట్ ఆధ్వర్యాన వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

బ్రీత్ ఆఫ్ లైఫ్ మినిస్ట్రీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బెనెడిక్ట్ హెల్త్ మెగా ఉచిత వైద్య శిబిరం భీమవరం గొల్లవానితిప్ప రోడ్ ప్రకాష్ నగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ట్రస్ట్ వ్యవస్థాపకులు శనివారం ఛైర్మన్ బత్తుల విజయకుమార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా దళిత ఐక్యవేదిక స్టేట్ ప్రెసిడెంట్ గంటా సుందర్ కుమార్, రాష్ట్ర ట్రస్ట్ అధినేత గంట రాజ్ కుమార్, భీమవరం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏలేటి న్యూటన్, గో సంరక్షణ అధ్యక్షులు సుంకర దాసు, ప్రముఖ న్యాయవాదులు గంటా కిరణ్ బాబు, గంటా క్రాంతి కుమార్ విచ్చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సేవలు అందించిన ప్రముఖ సర్జన్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఎం.గోవింద్ బాబు, ఎంబిబిఎస్ శ్వేతా నర్సింగ్ హోం, డాక్టర్ పి.లక్ష్మి మోనిక, ఎంబిబిఎస్ డివిఎస్ వేద క్లినిక్స్ క్లినిక్, డాక్టర్ ఎస్.కృష్ణ దుర్గ, యుపిహెచ్‌సి పలుసుమూడి వారు వచ్చి ఉచితంగా వైద్య సేవలు అందించారు. జయమెడికల్ 300కుపైగా వచ్చిన వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి తగిన మందులను, సిరిదేలను ట్రస్ట్ ఛైర్మన్ ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ ఛైర్మన్ గంట బేబీ మాథల్ గిల్‌సన్, ట్రెజరర్ గంట జయిరా ప్రియదర్శిని, డైరెక్టర్ రావూరి దుర్గారావు, గుజ్జుల గిరీశ్వర్ రావు, జుండల సునీల్ కుమార్ పాల్గొన్నారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం : నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 10వ తేదీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు తెలిపారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. సబ్ డివిజన్‌లోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో యథావిధిగా జరుగుతుందన్నారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులను ఉదయం 10:30 నుంచి అందజేయాలని కోరారు.

'నీరు వృథా చేయకండి'

పెనుమంట్ర : వేసవిలో మంచినీటి వినియోగం ఎక్కువగా ఉంటుందని, ఇలాంటి సమయంలో నీరు వృథా చేయవద్దని పెనుమంట్ర పంచాయతీ సర్పంచి తాడిపర్తి ప్రియాంక అన్నారు. శనివారం పెనుమంట్ర గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయం వెనక వీధిలో పాత పైప్ లైన్ స్థానంలో కొత్త పైపులైన్ నిర్మాణానికి ఆమె కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, వార్డు సభ్యులు గంటా దుర్గాదేవి చినబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత


ఆచంట : 11 కెవి ఆచంట ఫీడర్‌లో కొత్త విద్యుత్ లైన్స్ వేయుట కారణంగా ఆదివారం ఆచంట పరిధిలోని ఆచంట, నల్లజర్ల సెంటర్, కొరుపాలెం, చినమేడ, పెదమేడ, మనేపారిపాలెం ఏరియాల్లో ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.మధు కుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - నరసాపురం


మండలంలోని ఎల్‌బి.చర్ల గురుకుల పాఠశాల, కళాశాల, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2025-26 సంవత్సరానికి 5వ తరగతి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ మార్చి 13 వరకు పొడిగించినట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎల్ సాయిబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం(ఇంగ్లీష్ మీడియం)లో ప్రవేశానికి దరఖాస్తు ఆన్‌లైన్ ద్వారా సమర్పించడానికి మార్చి 13 వరకు పొడిగించడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, 5వ తరగతి ప్రవేశాలకు 4వ తరగతి స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, రేషన్ కార్డు మొదలైనవి, ఇంటర్ సంవత్సరం ప్రవేశానికి 10వ తరగతి స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, రేషన్ కార్డుతో మీ దగ్గరలోని ఆన్‌లైన్ సెంటర్లలో లేదా గురుకుల పాఠశాలలో సంప్రదించి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు.


ఆచంటలో..



తణుకు..


తాడేపల్లిగూడెంలో..


పాలకొల్లులో ఐద్వా ఆధ్వర్యాన..


మొగల్తూరులో మహిళా సర్పంచులను సత్కరిస్తున్న యాజమాన్యం


ఉండి..


గణపవరం గ్రామసభలో సత్కారం


పాలకొల్లు రూరల్‌లో..


పెనుమంట్ర..


తాడేపల్లిగూడెం : ర్యాలీలో పాల్గొన్న జిల్లా జడ్జి, పోలీసు అధికారులు


భీమవరం టౌన్ : మాట్లాడుతున్న మండలి ఛైర్మన్ మోషేన్ రాజు


పెనుగొండలో..

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మహిళలు చదువుకుంటేనే దేశాభివృద్ధి సాధ్యమని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అన్నారు. భీమవరం అంకాల ఆర్ట్ అకాడమిలో వైసిపి జిల్లా అధ్యక్షురాలు కోడే విజయమ్మ ఆధ్వర్యంలో శనివారం జరిగిన ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని, మహిళలు బాగుంటేనే ఆ కుటుంబం బాగుంటుందని, కుటుంబాలు బాగుంటే రాష్ట్రం బాగుంటుందన్నారు. అనంతరం ఐదుగురు మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో కోడే యుగంధర్, కామన నాగేశ్వరరావు, గాదిరాజు రామరాజు పాల్గొన్నారు.

నరసాపురం : సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలు అన్ని రంగాలలో అవకాశాలు కలిగినప్పుడే దేశం, సమాజం ముందుకు పోతుందని మీరా స్మారక గ్రంథాలయం, భగత్ సింగ్ విజ్ఞాన సేవా కేంద్రం అధ్యక్షులు ముచ్చర్ల త్రిమూర్తులు అన్నారు. స్థానిక మీరా గ్రంథాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. ఒదర్భంగా ఈ రోజున మహిళా దినోత్సవం నిర్వహించుకుంటున్నామన్నారు. ఎం.ఝాన్సీ రాణి, టి.పార్వతి, జి.జోష్ణ కీర్తి, మరియమ్మ, అలేఖ్య పాల్గొన్నారు.

నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. వీరమహిళల సమక్షంలో కేక్ కటింగ్ నిర్వహించారు

ఆచంట : సమాజంలో చట్టప్రకారం రాజకీయ పదవులు మహిళకు ఇచ్చినప్పటికీ భర్తల పెత్తనం వల్ల మహిళలు రాజకీయ అధికారం చెలాయించలేకపోతున్నారని సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్ రావు అన్నారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు వైట్ల ఉషారాణిని ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తలుపురి బుల్లబ్బాయి, నెక్కంటి కృష్ణమూర్తి, దేవబత్తుల రాధాకృష్ణ, అంగన్వాడీ కార్యకర్తలు మైలే విజయలక్ష్మి, గుత్తుల శ్రీదేవి, సుజాత పాల్గొన్నారు.

గణపవరం : సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని గణపవరం సర్పంచి మూరా అలంకారం అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక పంచాయతీలో జరిగిన మహిళా గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పురుషులతో పాటు మహిళలు రాణిస్తున్నారని అన్నారు. అనంతరం సభలో మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తోట శ్రీను, కూసంపూడి సురేంద్ర కుమార్ రాజు, రామలింగరాజు, ఎ.సీతయ్య, గంటా అన్నవరం పాల్గొన్నారు.

అంగన్వాడీలకు కనీస వేతనాలు అమలుచేయాలని, పనిభారం తగ్గించాలని శనివారం అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో అంగన్వాడీలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఎండి హసీనా బేగం మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాగమణి, కె.మహాలక్ష్మి, సిహెచ్.సీతామహాలక్ష్మి, ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం సరిపల్లి సచివాలయంలో మహిళా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మిని ఘణంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అంగన్వాడీ కార్యకర్తలు, మహిళలు, సచివాలయ కార్యదర్శి డి.రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: మండలంలోని శివదేవుని చిక్కాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించామని ప్రధానోపాధ్యాయులు పి.రాము తెలియజేశారు. పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులకు పసుపు, కుంకుమ, చీరలతో సన్మానించారు. ఈ సమావేశంలో సీనియర్ ఉపాధ్యాయులు ఎ.సత్యనారాయణ, వివిఎస్ఎన్.మూర్తి, టి.గోపాలకృష్ణ, జి.శాస్త్రి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం :సమాజ మార్పులో మహిళల పాత్ర కీలకమని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని తాడేపల్లిగూడెం, జనసేన క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ బనో, తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సిఐ పి.స్వరాజ్యలక్ష్మిలను ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మహిళా దినోత్సవం సందర్భంగా ఘనంగా సన్మానించారు.

తాడేపల్లిగూడెం టౌన్ పోలీస్ వారి ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌విఆర్ సెంటర్ నుంచి టౌన్ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో తాడేపల్లిగూడెం 11వ అదనపు కోర్టు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్య కిరణ్‌శ్రీ, అడిషనల్ పిపి ఎస్.శివరామకృష్ణ, తాడేపల్లిగూడెం డిఎస్‌పి డి.విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఎయిర్ స్ట్రిప్ మహిళా వాకర్స్ అధ్యక్షురాలు డాక్టర్ వనచర్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో భారతీయ విద్యా భవన్స్ సంగీత అధ్యాపకురాలు ఎస్‌కె.ఫాతిమా బీబీను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎయిర్ స్ట్రిప్ మహిళ వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఉండి : స్త్రీలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జెడ్‌పిటిసి రణస్థుల కనకదుర్గ అన్నారు. 111వ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉండి సీనియర్ వైసిపి నాయకులు గుండాబత్తుల సుబ్బారావు నివాసంలో మిత్ర మెడికేర్ సారథ్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్‌పిటిసి రణస్థుల కనకదుర్గ, ఉండి గ్రామ ఉప సర్పంచి గొట్టుముక్కల కళ్యాణ్ వర్మ మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలు రంగాల్లో విశేష సేవలు అందించిన మహిళలను గుర్తించి వారిని సత్కరించి, జ్ఞాపికలను అందించారు.

తణుకు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్య భవన్‌లో భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యు) ఆధ్వర్యంలో గౌరవప్రదమైన జీవితం దాతృత్వం కాదు, ఇది మహిళల హక్కు అందుకై పోరాడుదాం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా ఉపాధ్యక్షురాలు సావారపు దేవి సదస్సుకు అధ్యక్షత వహించారు. అనంతరం శ్రామిక మహిళలు సావారపు దేవి, ధర్మాని పుష్పలత, మహిళా నాయకురాలు వావిలాల సరళాదేవి, డాక్టర్ వంక వసుంధర, రిటైర్డ్ జడ్జి అడబాల లక్ష్మి, ఎస్.మనోరమ, భూపతిరాజు ఝాన్సీ, సికిలే పుష్పకుమారి, వై.నాగలక్ష్మిలను ఘనంగా సత్కరించారు.

పెంటపాడు : మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని, రాజకీయంగా ఎదిగారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు సిరపవరపు రంగారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి అన్నారు. పెంపపాడులోని గాంధీ బొమ్మ సెంటర్లో జె.శ్యామల కుమారి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వం మహిళా రక్షణ కోసం తీసుకొచ్చిన చట్టాలను కఠినంగా అమలు చేయాలని, మహిళలను కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శిరీష, రోజా, సంధ్య, ఉమాదేవి పాల్గొన్నారు.

వీరవాసరం : మహిళలు ఏ రంగంలోనూ తీసుపోలేరని సర్పంచి చిక్కులే మంగతాయారు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వీరవాసరం, రాయకుదురు పంచాయతీలలో శనివారం నిర్వహించారు. మంగతాయారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో మహిళలపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులను సంఘటితంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహిళ పారిశుధ్య కార్మికులను సత్కరించారు. ఇదేవిధంగా రాయకుదురులో సర్పంచి గడ్డం భారతి చేతుల మీదుగా అంగన్వాడీ మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు వీరవల్లి ఉష, బోను జోత్స్న దేవి, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

పాలకొల్లు : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రభుత్వాలు సామాన్య, మధ్యతరగతి ప్రజలకు చేయూత ఇవ్వాలని సీనియర్ ఐద్వా నేత అరటికట్ల నారాయణమ్మ కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా భవనం వద్ద జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు గతంలో కన్నా మెరుగైన పరిస్థితిలో ఉన్నా.. ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో చాలా వెనుకబడి ఉన్నారని చెప్పారు. సీనియర్ నాయకులు దొండపాటి రోజామని, ఎస్.జయప్రభ, జె.లక్ష్మి సరస్వతి, బి.సరోజినీ పాల్గొన్నారు. పాలకొల్లులో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న 100 మందికి పైగా మహిళలను మంత్రి నిమ్మల సత్కరించి చీరలు అందజేశారు.

పెనుగొండ : జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పెనుగొండ పంచాయతీలో మహిళా సర్పంచులను నక్క శ్యామల సోనీ సత్కరించారు. శనివారం పంచాయతీ వద్ద ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు చదువుకున్నప్పుడే వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతాయని, వారి కుటుంబం కూడా పిల్లల చదువు పట్ల ప్రాముఖ్యత ఇస్తారన్నారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరు : మహిళలు అన్ని రంగాల్లోనూ సత్తా చాటాలని నాయకర్ ట్రస్ట్ ఛైర్మన్ బొమ్మిడి సునీత నాయకర్ అన్నారు. మొగల్తూరులోని అగ్రహారంలో ఉన్న వివేక ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. పశు వైద్యాధికారిని జి.నీలిమ, ఐసిడిఎస్ సిడిపిఒ బి.ఊర్మిళ, పిహెచ్‌సి వైద్యురాలు కె.లక్ష్మీపార్వతి, సర్పంచులు పడవల మేరీ సత్యనారాయణ, మారెళ్ల మాధవి సుబ్రహ్మణ్యం, మేడిది సౌజన్య ప్రభాకర్, అందే వెంకటలక్ష్మి దొరబాబు, లోకం నాగలక్ష్మి వెంకటేశ్వరరావు, కవురు సావిత్రి ఆదినారాయణ, తిరుమాని విజయలక్ష్మి నరసింహమూర్తి, పులపర్తి భ్రమరాంబా దేవి ప్రతాప్‌లను పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ యు.గీతా రాంబాబు, సిబ్బంది ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందించారు.

పెనుమంట్ర : అన్ని రంగాల్లో మహిళలు చేస్తున్న సేవలు చాలా గొప్పవని పెనుమంట్ర గ్రామ సర్పంచి తాడిపర్తి ప్రియాంక అన్నారు. వివిధ శాఖలలో సేవలు అందిస్తున్న మహిళలకు, సీనియర్ మహిళలకు, మహిళా వార్డు సభ్యులకు శాలువా, పూల మాలలతో, జ్ఞాపికలతో ఆమె సత్కరించారు. ఉప సర్పంచి భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, కార్యదర్శి సీతారాం పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో పలు కేసుల రాజీ

ప్రజాశక్తి - తణుకు

తణుకు కోర్టులో ఛైర్మెన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు 2025 సంవత్సరానికి గాను మొదటి జాతీయ లోక్ అదాలత్‌లో ఇప్పటి వరకు 723 కేసులు రాజీ చేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్ కేసులు 712, బ్యాంక్, టెలిఫోన్ బకాయిలు 11 కేసులు రాజీ చేశారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా బార్ అసోసియేషన్ మహిళా న్యాయవాదులు, కోర్టు సబ్బంది కలిసి మహిళా న్యాయమూర్తులను సత్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత, రెండవ స్పెషల్ బెంచ్ మెజిస్ట్రేట్ తాడి ఆంజనేయులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూరంపూడి కామేష్, సీనియర్ న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, బెంచ్ సభ్యులు పాల్గొన్నారు.

నరసాపురం : జాతీయ లోక్ అదాలత్‌లో 310 కేసులు పరిష్కరించినట్లు నరసాపురం న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, 10వ అదనపు జిల్లా జడ్జి పి.విజయ దుర్గ తెలిపారు. శనివారం కోర్టు హాల్‌లో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ అదాలత్‌లో సివిల్ కేసులు 12, ఇన్స్యూరెన్స్ కేసులు 1, కుటుంబ తగాదాలు 5, నరసాపురం టౌన్, రూరల్, మొగల్తూరు, యలమంచిలి పోలీస్ స్టేషన్‌లకు సంబంధించిన క్రిమినల్ కేసులు 66, ఎక్సైజ్ కేసులు 119, చెక్ బౌన్స్ కేసులు 09, బిఎస్ఎన్ఎల్ 8 కేసులు, బరోడా బ్యాంక్ కేసులు 6, బెంచ్ కోర్ట్ కేసులు 84 మొత్తం 310 కేసులను ఉభయ పార్టీల కోరిక మేరకు రాజీ చేసినట్లు 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.విజయ దుర్గ తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌ను 3 బెంచ్‌లుగా ఏర్పాటుచేశారు. బెంచ్ అధికారులుగా న్యాయమూర్తులు సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) జి.గంగ రాజు, అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) కె.శ్రీనివాస్, సభ్యులుగా చల్లా జ్యోతి, ఎ.నాగేశ్వరరావు, ఎస్.శ్రీధర్, బెంచ్ సభ్యులుగా వ్యవహరించారు. మొత్తం రూ.కోటి పందొమ్మిది లక్షల తొంబై మూడు వేల 700కు అవార్డులను జారీ చేసినట్లు 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.విజయ దుర్గ తెలిపారు. సీనియర్ న్యాయవాది కె.స్వామి నాయుడు కక్షిదారులకు అల్పాహారాన్ని అందించారు. తదనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా న్యాయవాదులు, న్యాయమూర్తి పి.విజయ దుర్గని సన్మానించారు.

తాడేపల్లిగూడెం : రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు తాడేపల్లిగూడెం కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 524 కేసులు రాజీ అయినట్లు తాడేపల్లిగూడెం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు 182, సివిల్ కేసులు 29, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు 13, ప్రిలిటిగేషన్ కేసులు 16, బెంచ్ కోర్టు కేసులు 284 కలిపి మొత్తం 524 కేసులు రాజీ అయినట్లు ఆయన తెలిపారు.

పాలకొల్లు : పాలకొల్లు జూనియర్ డివిజన్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి షేక్ జియాద్దీన్ పాలకొల్లు కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో భాగంగా 38 ఐపిసి కేసులు, 6 చెక్కు బౌన్స్ కేసులు, 2 మనోవర్తి కేసులు, 1 గృహహింస కేసు, 48 ఎక్సైజ్ కేసులు, 15 ప్రామిసరీ నోట్ కేసులు, 2 ఎగ్జిక్యూషన్ కేసులు, 64 బెంచ్ కోర్టు కేసులు మొత్తం 176 కేసులు పరిష్కరించారు. రూ.66 లక్షల 89 వేల 508 బాధితులకు ఇప్పించారు. ఈ అదాలత్‌తో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్‌వి.సూర్యనారాయణ, బెంచ్ అడ్వకేట్ మెంబెర్ జె.వెంకటేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

తాగు, సాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు: ఎంఎల్ఎ

ఆచంట : వేసవికాలం నేపథ్యంలో మండలంలో తాగు, సాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆచంట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి దిగుమర్తి సూర్యకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో అసంపూర్తిగా నిలిచిన అంగన్వాడీ కేంద్రాల వివరాలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణపై ఫిర్యాదులు వస్తున్నాయని, కేంద్రాల వద్ద స్టాక్ బోర్డులో ఏర్పాటు చేయాలని సూచించారు. జగనన్న కాలనీల్లో అసంపూర్తిగా నిలిచిన నిర్మాణాలు పూర్తి చేయడానికి మే నెలాఖరు వరకు గడువు ఇస్తున్నామని, ఈ లోపు ఇల్లు నిర్మాణం పూర్తి చేయాలని పితాని కోరారు. గత ప్రభుత్వం మాదిరిగా మాకు కక్షపూరితంగా వ్యవహరించడం లేదని, ఈ విషయం ప్రజలందరూ గ్రహించాలని కోరారు. విద్యా విధానంలో ప్రభుత్వం నూతన వరవడి తీసుకువస్తుందని, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చు దిద్దుతున్నామని ఆయన అన్నారు. రైతులకు 50 శాతం సబ్సిడీపై ట్రాక్టర్లు స్ప్రేయర్లు అందించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆచంట నియోజకవర్గ వ్యాప్తంగా లో వోల్టేజి సమస్య పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఇందులో భాగంగా పెనుగొండ విద్యుత్ సబ్ స్టేషన్ ఆధునీకరణ చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపిపి దిగుమర్తి సూర్యకుమారి, వైస్ ఎంపిపిలు పాల్గొన్నారు.